సాక్షి
తూర్పుగోదావరి
బుధవారం । 25 । జూన్ । 2025



పోల్ పడితే పతకమే!

అతడు పోల్ పట్టాడంటే పతకం రావాల్సిందే. ఎటువంటి సౌకర్యాలూ లేకున్నా దృఢ సంకల్పంతో తొలి ప్రయత్నాల్లోనే రాష్ట్ర, జాతీయ స్థాయి పతకాలను కొల్లగొడుతున్నాడు.


8 లో



ఏసీ బ్లాక్ నకిలీ మద్యం గుట్టు రట్టు

కొమరగిరిపట్నంలోని ఓ ఇంట్లో గుట్టుగా సాగుతున్న నకిలీ మద్యం తయారీ యూనిట్ గుట్టును ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రేణుక బృందం రట్టు చేసింది.

డెల్టాలకు 12,200 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 12,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.15 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా సరిత



డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావుకు మొక్క అందజేస్తున్న సరిత

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ఉప వైద్య, ఆరోగ్య శాఖాధికారి(డిప్యూటీ డీఎంహెచ్‌ఓ)గా పి.సరిత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా అదనపు డీఎంహెచ్‌ఓగా, ప్రోగ్రాం అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా బొమ్మూరులోని కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి, మొక్క అందజేశారు. రాజమహేంద్రవరం డివిజన్‌లోని అన్ని పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా సరితకు డీఎంహెచ్‌ఓ సూచించారు. జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి ఉన్నత స్థానంలో నిలిపేలా చూస్తానని ఆమె చెప్పారు.

సర్టిఫికెట్ల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశాలకు బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జరిగిన సర్టిఫికెట్ల పరిశీలనకు 240 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు. బుధవారం 68,001 నుంచి 86,000 వరకూ వరకూ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఆప్షన్ల ఎంపిక జరుగుతుందని తెలిపారు. బుధ, గురువారాల్లో 1 నుంచి 50,000 ర్యాంకు వరకూ అభ్యర్థులు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చన్నారు.

అన్నదాన భవనానికి రూ.లక్ష విరాళం



దాతకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ సిబ్బంది

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి భక్తులు భారీగా విరాళాలు సమర్పిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన కొటికలపూడి నాగ రవీంద్రకుమార్, విజయ వాణి దంపతులు, కుటుంబ సభ్యులు మంగళవారం రూ.1,11,116 విరాళం సమర్పించారు. స్వామివారి దర్శనానంతరం వారికి దేవస్థానం సిబ్బంది స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. స్వామివారికి నిత్య కల్యాణం, ఏడు ప్రదక్షిణలు చేసిన భక్తులు అష్టోత్తర నామార్చనలు నిర్వహించారు. స్వామివారి ప్రత్యేక దర్శనం, విశిష్ట దర్శనం, వేదాశీర్వచనం, అన్న ప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాదాల విక్రయం, ఆన్‌లైన్ సేవల ద్వారా దేవస్థానానికి రూ.3,53,341 ఆదాయం వచ్చినట్టు దేవదాయ శాఖ ఉప కమిషనర్, ఆలయ ఈఓ చక్రధరరావు తెలిపారు.

పీజీ ఈసెట్‌లో 93.85 శాతం ఉత్తీర్ణత

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహించిన పీజీ ఈసెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు 93.85 శాతం మేర ఉత్తీర్ణత సాధించారు. పీజీ విభాగంలో 13 సబ్జెక్టులకు సంబంధించి ఈ పరీక్షకు 931 మంది దరఖాస్తు చేసుకోగా 764 మంది రాశారు. వీరిలో 717 మంది ఉత్తీర్ణులయ్యారు. కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో కుంచె సుదర్శన్ (కాకినాడ రూరల్ పెనుమర్తి) 7, సివిల్ ఇంజినీరింగ్‌లో అల్లు సాయి నవీన్ (పెద్దాపురం) 8, కె.వెంకట రామప్రసాద్‌వర్మ 10, ఈఈఈ విభాగంలో ఎస్.లాస్య (సామర్లకోట) 3, సి.సత్య వెంకట లోవ శివ సమీర్ (తొండంగి) 10, ఎం.కృష్ణ కౌశిక్ (దుర్గాడ) 10, ఫుడ్ టెక్నాలజీలో బిళ్లకుర్తి జ్యోతి (కాకినాడ) 4, ఇన్‌స్ట్రుమెంట్ విభాగంలో రాయుడు సాయిరామ్ (జగన్నాథగిరి) 1, పి.సాయి (ఎ.కొత్తపల్లి) 4, మెకానికల్ విభాగంలో కె.లోకేష్ (సీతారామపురం) 1, మెటలర్జీ విభాగంలో ఎం.నాగేశ్వరి (పేపకాయలపాలెం) 4, నానో టెక్నాలజీలో కె.విశాల్ (సర్పవరం) 9 ర్యాంకులు సాధించారు.

సీసీఆర్ ఛీ



- రబీ ధాన్యం డబ్బులు నేటికీ ఇవ్వని సర్కారు
- 'అన్నదాత సుఖీభవ' ఊసే లేదు
- కౌలు రైతులకు అరకొరగా సీసీఆర్ కార్డులు
- 1.10 లక్షల మందికి ఇవ్వాలన్నది లక్ష్యం
- ఇప్పటి వరకూ ఇచ్చినవి 14,752
- సాగు పెట్టుబడి కోసం దిక్కులు చూస్తున్న రైతులు

పెరవలి: ఓవైపు ఖరీఫ్ సాగు మొదలై దాదాపు 25 రోజులైపోయింది. మెట్ట ప్రాంతంలో ఇప్పటికే బోరుబావుల కింద సాగు పనులు మొదలవుతుండగా.. ఇటు గోదావరి డెల్టా కాలువలకు కూడా నీరు విడుదల చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఇంకా చాలా మందికి గత రబీ ధాన్యం డబ్బులు ఇవ్వకపోవడం.. అన్నదాత సుఖీభవ సాయం అందించకపోవడంతో సాగుకు అవసరమైన పెట్టుబడి కోసం రైతులు ముఖ్యంగా కౌలు రైతులు దిక్కులు చూస్తున్నారు. దీనికి తోడు పంట సాగు హక్కుదారుల కార్డుల (సీసీఆర్‌సీ) జారీలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతూండటంతో అటు రుణాలు కూడా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది 1.10 లక్షల మందికి సీసీఆర్ కార్డులు అందించాల్సి ఉండగా ఈ నెల 23వ తేదీ నాటికి 14,752 మందికి మాత్రమే మంజూరు చేశారు. ఇంకా 86,954 మంది కౌలు రైతులు సీసీఆర్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా గోపాలపురం మండలంలో 43.93 శాతం, అతి తక్కువగా రాజానగరంలో 8.96 శాతం మేర మాత్రమే కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు పంపిణీ చేశారు.



ఉసులుమర్రులో ఆకుమడికి చేను సిద్ధం చేస్తున్న రైతులు

గ్రామసభలేవీ!

సాధారణంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగానే, సీసీఆర్ కార్డులపై రైతులకు, కౌలు రైతులకు అవగాహన కల్పించేందుకు రెవెన్యూ, వ్యవసాయ అధికారులు గ్రామసభలు నిర్వహించాలి. ఆ సభల్లో అర్హులైన కౌలు రైతులను గుర్తించి సీసీఆర్ కార్డులు మంజూరు చేయాలి. కానీ, జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకూ ఎక్కడా గ్రామసభలు నిర్వహించిన దాఖలాలు కనిపించడం లేదు. మరోవైపు కౌలు రైతులు సీసీఆర్ కార్డుల కోసం రైతు సేవా కేంద్రాలు (ఆర్‌ఎస్‌కే), రెవెన్యూ, వ్యవసాయాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సర్వర్లు పని చేయటం లేదని, ఇంకా సమయముందని, కార్డులు తర్వాత వస్తాయని అధికారులు చెబుతున్నారు. వ్యవసాయానికి సంబంధించిన పోర్టల్ పని చేయడం లేదని రెవెన్యూ అధికారులు అంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులను అడుగుతూంటే ప్రభుత్వం మార్పులు చేయడంతో నాలుగు రోజులు మాత్రమే పని చేయలేదని బదులిస్తున్నారు. ఏదేమైనా కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు మాత్రం అందడం లేదు. చేసేది లేక బయటి వ్యక్తుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుని సాగు పనులు చేపట్టాల్సి వస్తోందని, గతంలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి చూడలేదని కౌలు రైతులు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో సీసీఆర్ కార్డుల కోసం రెవెన్యూ, వ్యవసాయాధికారులు తమ చుట్టూ తిరిగేవారని, నేడు వారి చుట్టూ తాము కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోందని చెబుతున్నారు.

సీసీఆర్ కార్డులతో ఇదీ మేలు

గతంలో బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్) భూ యజమానులైన రైతులకే రుణాలు మంజూరు చేసేవి. ప్రభుత్వ సబ్సిడీలు వారికే అందేవి. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వారికి మాత్రమే ప్రభుత్వం పరిహారం అందించేది. పంటల బీమా కూడా భూమి యజమానులకే అందేది. దీంతో, ఆ భూమిని కౌలుకు చేస్తున్న రైతులు నష్టపోయేవారు. ఈ నేపథ్యంలో కౌలు రైతులను అన్నివిధాలా ఆదుకునే లక్ష్యంతో వారికి రుణ అర్హత గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ మొదలైంది. దీనికి మొదట్లో భూ యజమానులు అంగీకరించేవారు కాదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో భూ యజమానుల హక్కులకు ఎటువంటి భంగమూ వాటిల్లకుండా కేవలం 11 నెలల కాలానికే ఒప్పందం చేస్తూ కౌలు చట్టాన్ని సవరించారు. ఖరీఫ్, రబీ సీజన్లకు కలిపి ఒకసారి జారీ చేసిన కార్డును భూ యజమాని అంగీకారం మేరకు రెన్యువల్ చేసుకునే వీలు కల్పించారు. భూ యజమానుల్లో అపోహలు తొలగించడంతో అప్పట్లో సీసీఆర్ కార్డులు గణనీయంగా పెరిగాయి. దీంతో, భూ యజమానిగా ఉన్న రైతుకే కాకుండా కౌలు రైతులకు కూడా పంట రుణాలతో పాటు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు కూడా అందించేవారు. అలాగే, విపత్తులు సంభవించినప్పుడు పరిహారం, ఉచిత పంటల బీమా వంటివి కౌలు రైతులకు అందజేసేవారు. ఆ విధంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తమకు కొండంత అండగా ఉండేదని కౌలు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రబీ ధాన్యం డబ్బులతో పాటు ఇప్పటి వరకూ అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం కూడా ఇవ్వలేదని వాపోతున్నారు.

జోరుగా సాగుతోంది




కౌలు రైతులకు సీసీఆర్ కార్డుల ప్రక్రియ కొనసాగుతోన్నది. మొదట్లో కొన్ని ఇబ్బందులున్నా ఇప్పుడు ఈ ప్రక్రియ జోరందుకుంది. వారం రోజుల్లో ఇది 75 శాతానికి పెరుగుతుంది.

– పి.చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, కొవ్వూరు

మండలాల వారీగా కార్డుల మంజూరు ఇలా..

మండలం	కార్డుల లక్ష్యం	ఇచ్చిన కార్డులు	ఇవ్వాల్సిన కార్డులు
రాజానగరం	9,845	310	8,963
రాజమహేంద్రవరం రూరల్	1,701	114	1,534
కోరుకొండ	9,981	319	8,985
బిక్కవోలు	6,624	0	5,929
కొవ్వూరు	5,994	245	5,235
కడియం	4,254	61	3,672
నల్లజర్ల	6,693	936	5,718
రంగంపేట	6,081	727	5,047
గోకవరం	6,052	545	5,010
నిడదవోలు	6,692	677	5,342
సీతానగరం	5,994	962	4,483
తాళ్ళపూడి	4,452	1,074	3,234
అనపర్తి	6,108	0	4,365
ఉండ్రాజవరం	5,862	1,268	4,174
పెరవలి	6,108	1,715	4,349
దేవరపల్లి	6,292	1,651	4,173
చాగల్లు	5,872	1,820	3,716
గోపాలపురం	5,395	2,328	3,025

అధికారుల చుట్టూ తిరగలేకపోతున్నాం



ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 25 రోజులవుతోంది. నేటి వరకూ 14 వేల సీసీఆర్ కార్డులు మాత్రమే పంపిణీ చేశారు. కార్డుల కోసం అధికారుల చుట్టూ తిరగలేకపోతున్నాం, ఒకవైపు పంట వేసే కాలం వచ్చేసింది. మరోవైపు కార్డులు లేక రుణం అప్పు పుట్టని పరిస్థితి. ఈ ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఇదీ.

– పిల్లా శ్రీనివాస్, రైతు, కొత్తపల్లి అగ్రహారం

ఆర్థికంగా నలిగిపోతున్నాం



గతంలో పెట్టుబడి సాయం మే నెలలోనే అందేది. ఈ ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా నేటికీ ఆ మాటే లేదు. పండించిన ధాన్యం కొనుగోలు చేశారు. కానీ, నేటికీ ఆ సొమ్ము ఇవ్వలేదు. దీంతో సాగుకు డబ్బుల్లేక ఆర్థికంగా నలిగిపోతున్నాం. అయినా పట్టించుకున్న నాథుడే లేడు.

– జుత్తుగ రంగయ్య, రైతు, ముక్కామల

ఎస్‌ఏసీహెచ్‌ఈటీ యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు. చిత్రంలో కేంద్ర బృందం, జెడ్పీ చైర్మన్ విప్పర్తి తదితరులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): విపత్తుల సమాచారం పొందేందుకు ప్రతి ఒక్కరూ ఎస్ఏసీహెచ్‌ఈటీ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, అందులో వచ్చే హెచ్చరికల మేరకు అప్రమత్తంగా ఉండాలని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ సంయుక్త సలహాదారు నావెల్ ప్రకాష్ అన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన ముగ్గురు సభ్యుల జాతీయ విపత్తుల నిర్వహణ బృందం జిల్లా విపత్తుల నిర్వహణ సంస్థ పనితీరు, కొత్తగా ప్రతిపాదించిన ఎన్‌డీఎంఏ–2025 ప్రతిపాదనలపై కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా నావెల్ ప్రకాష్ మాట్లాడుతూ, విపత్తుల సమయంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు వాటిల్లకుండా కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో తీసుకుంటున్న నిర్ణయాలు జిల్లా స్థాయిలో ఏవిధంగా అమలు చేస్తున్నారో తెలుసుకునేందుకు తాము పర్యటిస్తున్నామని చెప్పారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు పరిశ్రమలకు వచ్చే రూ.200 కోట్ల లాభంలో 2 శాతం, రూ.500 కోట్ల లాభంలో 5 శాతం మేర సీఎస్ఆర్ ఫండ్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని చెప్పారు. దీనిపై ఆయా సంస్థలకు సమాచారం ఇవ్వాలని, వారిని భాగస్వాముల్ని చేయాలని సూచించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ, విపత్తుల సమయంలో శాఖల వారీగా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు, సారవంతమైన భూములు వృథాగా మారకుండా చూసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల వారీగా వ్యక్తిగత చర్యల కన్నా సంయుక్త కార్యాచరణ ప్రణాళిక అమలు చేయడం ద్వారా విపత్తులను అధిగమించడం సాధ్యమవుతుందని అన్నారు. సమావేశంలో కేంద్ర బృందం సభ్యులు అభిషేక్ బిశ్వాస్, అభినవ్ వాల్యా, జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, డీఆర్‌ఓ టి.సీతారామమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డీఎస్‌పీ సీహెచ్ పీటర్ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు రాజకీయాలు చేస్తున్నారు

- రాష్ట్రంలో భయంకరమైన పరిస్థితి
- కూటమి ప్రభుత్వంపై మాజీ హోం మంత్రి వనిత మండిపాటు



మీడియాతో మాట్లాడుతున్న మాజీ హోం మంత్రి తానేటి వనిత

దేవరపల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలు చేస్తోందని మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు తానేటి వనిత మండిపడ్డారు. దేవరపల్లి మండలం యర్నగూడెం ఆర్ కన్వెన్షన్ హాలులో మంగళవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి వయస్సుకు తగిన మాటలు మాట్లాడటం లేదని విమర్శించారు. 'మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నోరు పారేసుకున్న బుచ్చయ్య చౌదరిపై ఎటువంటి కేసులూ ఉండవు. ఆయన మాట్లాడిన మాటలకు ఎటువంటి సెక్షన్లూ వర్తించవు. అదే వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు మాట్లాడితే మాత్రం వెంటనే ఎక్కడా లేని సెక్షన్లు పుట్టుకు వచ్చే పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది' అని దుయ్యబట్టారు. కూటమి పాలనలో రాష్ట్రంలో భయంకరమైన రాజకీయాలు చూస్తున్నామని చెప్పారు. ప్లకార్డు ప్రదర్శించడంపై మాట్లాడితే కూటమి నాయకులు ఇష్టమొచ్చినట్లు నోరు పారేసుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో పాలన రాజ్యాంగబద్ధంగా సాగడం లేదని విమర్శించారు. 'కూటమి నాయకులు ఏం మాట్లాడినా భగవద్గీత, రామాయణం. మేం మాట్లాడితే బూతు పురాణం' అన్నట్లు ఫీలవుతున్నారని అన్నారు. రాష్ట్రంలో వాస్తవాలను వాస్తవాలుగా చూపించడం, తప్పు జరిగిన చోట ఖండించడం జరగడం లేదన్నారు. పల్నాడు ఘటనలో ఎస్పీ తొలుత ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన దానికి, తర్వాత మాట్లాడిన దానికి పొంతన లేదని వనిత చెప్పారు. ఆయనపై కూటమి ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి సెక్షన్లు మార్చేసి, వాళ్లకు ఇష్టమొచ్చినట్లు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడికి వెళ్లినా జనం స్వచ్ఛందంగా వస్తున్నారని, అది చూసి కూటమి నేతలు తట్టుకోలేకపోతున్నారని అన్నారు. భద్రత కల్పిస్తే ఆయన పర్యటన సజావుగా సాగిపోతుందని, అదే భద్రత కల్పించకపోతే అవాంఛనీయ సంఘటనలు జరుగుతాయనేది ప్రభుత్వ దురాలోచనని విమర్శించారు.

పుష్కరాల తొక్కిసలాటపై కేసు ఏమైంది?

గోదావరి పుష్కరాల తొక్కిసలాటలో 29 మంది భక్తులు చనిపోయారని, అప్పుడు చంద్రబాబును బాధ్యుడిగా చేసి కేసు పెట్టారా? పెడితే ఆ కేసులేమయ్యాయని వనిత ప్రశ్నించారు. గతంలో ప్రతిపక్ష నేతగా చంద్రబాబు చీరలు పంపిణీ చేసినప్పుడు 8 మంది చనిపోయారని ఆ కేసులేమయ్యాయని నిలదీశారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జరిగిన రెండు సంఘటనల్లో ప్రజలు చనిపోయినా ఎటువంటి చర్యలూ ఉండవని, ఇప్పుడు మాత్రం రాద్ధాంతం చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలకు మంచి పరిపాలన అందించాలనే ఆలోచన కూటమి నేతల్లో లేదన్నారు. నాలుగేళ్ల తర్వాత మళ్లీ అసత్య వాగ్దానాలతో ముందుకు వద్దామన్న ఆలోచనలో కూటమి నేతలున్నారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. వారిని నమ్మి ఓట్లేసి మోసపోయామని ప్రజలు కుమిలిపోతున్నారన్నారు. నేడు ప్రతి కుటుంబంలోనూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను గుర్తు చేసుకోని వారు ఎవరూ లేరని తెలిపారు. రూ.5 వేలు ఏం సరిపోతాయి? మీ పొట్ట కొట్టనని వలంటీర్లతో అన్న పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎవరి పొట్ట కొట్టారని ప్రశ్నించారు. ఆయన నియోజకవర్గంలో దళితులు వెలికి గురైతే కనీసం స్పందించలేదని విమర్శించారు. ప్రశ్నించే గొంతు అని చెప్పిన పవన్ కల్యాణ్ గొంతు ఇప్పుడేమైయిందని వనిత ప్రశ్నించారు.



పెరిగిన పొగాకు బేళ్లు



దేవరపల్లి వేలం కేంద్రానికి అమ్మకానికి వచ్చిన పొగాకు బేళ్లు

దేవరపల్లి: వర్జీనియా పొగాకు వేలం కేంద్రాల్లో బేళ్ల సంఖ్య పెరిగింది, దీంతో, కొనుగోళ్లు కొద్దిగా మెరుగుపడ్డాయి. మొన్నటి వరకూ పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాలకు రోజుకు 3 వేల నుంచి 4 వేల బేళ్లు వేలానికి వచ్చేవి. వీటిలో 40 శాతం అమ్ముడుపోక రైతులు ఇబ్బంది పడేవారు. కొనుగోళ్లు ప్రారంభించి సుమారు 73 రోజులైనప్పటికీ మార్కెట్లో పొగాకు ధర నిలకడగా కొనసాగుతూ వస్తోంది. ప్రారంభంలో కిలో గరిష్ఠ ధర రూ.290 పలికంది. ఇప్పటికీ అదే ధర కొనసాగుతూండటంతో రైతులు అసంతృప్తితో ఉన్నారు. మార్కెట్లో ఎక్స్ గ్రేడ్ పొగాకు కొనుగోలుకు ట్రేడర్లు ఆసక్తి చూపడంతో దానిని అమ్ముకోవడానికి రైతులు ముందుకు వస్తున్నారు. దీంతో మంగళవారం వేలం కేంద్రాలకు వచ్చిన బేళ్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. సోమవారం ఐదు వేలం కేంద్రాల్లో అమ్మకానికి 4,640 బేళ్లు రాగా, మంగళవారం ఆ సంఖ్య 6,560కి పెరిగిందని అధికారులు తెలిపారు. 4,704 బేళ్లు అమ్ముడవగా, 1,856 బేళ్లను కొనుగోలుదారులు తిరస్కరించారు. దేవరపల్లి వేలం కేంద్రానికి 1,013, జంగారెడ్డిగూడెం–1కు 1,221, జంగారెడ్డిగూడెం–2కు 1,682, కొయ్యలగూడేనికి 1,355, గోపాలపురం వేలం కేంద్రానికి 1,289 చొప్పున బేళ్లను రైతులు అమ్మకానికి తీసుకువచ్చారు. మార్కెట్లో పొగాకు గరిష్ఠ ధరను కిలోకు రూపాయి చొప్పున పెంచి ట్రేడర్లు కొనుగోలు చేశారు. ఎగుమతుల ఆర్డర్లు ఖరారైతే మార్కెట్ కొంత వరకూ మెరుగుపడుతుందని రైతులు ఆశిస్తున్నారు.



క్లుప్తంగా

కొడుకు కష్టం కానలేక తండ్రి ఆత్మహత్య

కడియం: తల్లి ఆలన, లాలన ఎలా **ఉన్నా.. తండ్రి** పాలన సహజంగానే కఠినం అని**పిస్తుంది. అదంతా** ఆ బిడ్డడి వృద్ధి కోసమేనని అ**ందరికీ తెలిసిందే.** ఆ కాఠిన్యం వెనుక వెన్నలాం**టి మనసు ఉం**టుందని, ఆ బిడ్డకి ఏ కష్టం వచ్చినా మనసు ద్రవించి కళ్లు తేమదేరుతాయని ఎందరికి తెలుసు? ఆ కష్టం తాను తీర్చలేనిదైతే.. తన చేతుల్లో లేనిదైతే.. ఎంత కాలమని ఆ బిడ్డ కష్టాన్ని చూస్తూ సహించగలడు? ఆ సహనాన్ని కోల్పోయి ఓ తండ్రి ఆత్మహత్యకు పాల్పడి ఉసురు తీసుకున్నాడు. మండలంలోని కడియపుసావరం గ్రామానికి చెందిన షేక్ మదీనా (60) మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మదీనాకు ఇద్దరు కుమారులు. వారిలో చిన్నవాడైన 30 ఏళ్ల రహీముద్దీన్ ఇటీవల జారిపడడంతో కాలు విరిగింది. దానికి శస్త్ర చికిత్స చేయాల్సి ఉండగా అతడికి మధుమేహం ఎక్కువగా ఉండడంతో అది తగ్గే వరకు శస్త్రచికిత్సకు అవకాశం లేదని వైద్యులు చెప్పారు. కుమారుడి పరిస్థితిని తట్టుకోలేక మనస్తాపంతో తన ఇంటి వద్దనున్న సిమెంటు దుకాణం దూలానికి 12 గంటల సమయంలో మదీనా ఉరి వేసుకున్నాడు. అతడి భార్య గమనించి, చుట్టుపక్కల వారి సాయంతో కిందికి దింపి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మదీనా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎస్‌ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

పోల్ పడితే పతకమే!

- పోల్‌వాల్ట్‌లో రాణిస్తున్న పిఠాపురం క్రీడాకారుడు రవి
- కొద్దిపాటి వసతులతోనే కఠోర శిక్షణ
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు

పిఠాపురం: అతడు పోల్ పట్టాడంటే పతకం రావాల్సిందే. ఎటువంటి సౌకర్యాలు లేకున్నా ఉన్న కొద్దిపాటి వసతులతో దృఢ సంకల్పం, పట్టుదలతో శిక్షణ తీసుకుని తొలి ప్రయత్నాలలోనే రాష్ట్ర, జాతీయ స్థాయి పతకాలను కొల్లగొడుతున్నాడు. తక్కువ కాలంలో ఏకంగా 15 స్వర్ణ, 2 రజత, 3 కాంస్య పతకాలు సాధించిన ఘనత అతడి సొంతం. పిఠాపురం విద్యార్థి పోల్‌వాల్ట్‌లో ఉత్తమ క్రీడాకారుడిగా ప్రతిభ చూపుతున్నాడు. డిగ్రీ చదువు పూర్తి చేసి ఉన్నత విద్య కోసం సాగుతూనే పోల్‌వాల్ట్‌లో ప్రతిభ చూపుతున్నాడు సాలా రవి.

పతకాల వేటలో పోటీలేదు..

తొమ్మిదో తరగతి నుంచి పోల్‌వాల్ట్‌లో పట్టు సాధించిన రవి జాతీయ స్థాయిలో రాష్ట్రం తరఫున హైదరాబాద్, చెన్నై, కేరళ, కరీంనగర్, బెంగళూరు, పూణే, పంజాబ్, జార్ఖండ్ తదితర ప్రాంతాల్లో పోటీల్లో పాల్గొని ఎన్నో పతకాలు కైవసం చేసుకున్నాడు. జాతీయ స్థాయిలో కరీంనగర్, గుంటూరు, కేరళ తదితర ప్రాంతాల్లో జరిగిన క్రీడల్లో పాల్గొని ప్రశంసలు అందుకున్నాడు.



రవి సాధించిన పతకాలు, ప్రశంసాపత్రాలు →



అంతర్జాతీయ పతకమే లక్ష్యం



పోల్‌వాల్ట్‌లో అంతర్జాతీయ పోటీల్లో గెలవాలన్నదే లక్ష్యంగా కృషి చేస్తున్నాను. మా కోచ్ ఎలిపే సునీల్ దేశాయ్. తమలో క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడం వల్లే ఇన్ని పతకాలు సాధించాను. చిన్నప్పుడు తమ పాఠశాలలో సీనియర్లు పోల్‌వాల్ట్ ఆడుతుంటే చూసి నాకూ ఆడాలనిపించింది. కోచ్ సునీల్ దేశాయ్‌కు ఆ క్రీడపై ఆసక్తిని వివరించాను. దీంతో ఆయన తనను ప్రోత్సహించి క్రీడలో మెళకువలు నేర్పించారు. సరైన సౌకర్యాలు లేకపోయినా మంచి ఫలితాలను సాధించేలా శిక్షణ ఇచ్చారు.

– సాలా రవి, పోల్‌వాల్ట్ క్రీడాకారుడు, పిఠాపురం



పోల్‌వాల్ట్‌లో జంప్ చేస్తున్న రవి

ప్రభుత్వం సహకరిస్తే మరిన్ని పతకాలు



ఆటలు నేర్పడం కాదు. ఏ ఆటలో ఎవరు నిష్ణాతులు కాగలరో గుర్తించి శిక్షణ ఇవ్వాలి. అంతే కాకుండా వారిని ప్రోత్సహించి విద్యార్థిలో ఉన్న క్రీడా స్ఫూర్తిని వెలికితీస్తే జాతీయ స్థాయి క్రీడాకారులు తయారవుతారు. విద్యార్థుల్లో ఉన్న క్రీడాసక్తిని వెలుగులోకి తేవడం ద్వారా వారిని మంచి క్రీడాకారులుగా తయారు చేయడానికి ప్రభుత్వ ప్రోత్సాహం ఎంతైనా అవసరం. ప్రభుత్వం పోల్‌వాల్ట్ క్రీడకు మంచి ప్రాధాన్యం ఇచ్చి అన్ని సౌకర్యాలు కల్పిస్తే మరింత మంది క్రీడాకారులు తయారై రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకువస్తారు. పోల్‌వాల్ట్‌లో రవి మంచి ప్రతిభ చూపుతున్నాడు. ప్రతి పోటీలోను తన సత్తా చాటుతూ పతకాలను సాధిస్తున్నాడు. రానున్న రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో ఆడేలా కృషి చేస్తున్నాడు.

– ఎలిపే సునీల్ దేశాయ్, కోచ్, పిఠాపురం

గాడాలలో ఎద్దుల బలప్రదర్శన



రంకెలేస్తూ పరిగెడుతున్న ఎద్దులు



ప్రథమ బహుమతి, ట్రోఫీని అందుకుంటున్న చక్రద్వారబంధం గ్రామానికి చెందిన శ్రీను

కోరుకొండ: మండలంలోని గాడాలలో మంగళవారం ఎద్దుల బలప్రదర్శన పోటీ జరిగింది. పోటీల్లో రాజానగరం నియోజకవర్గంలోని 25 జతల ఎద్దులు పాల్గొన్నాయి. తక్కువ సమయంలో నిర్ణీత ప్రదేశానికి ఎద్దుల బండితో చేరుకున్న ఎద్దులకు బహుమతులు అందజేశారు. చక్రద్వారబంధానికి చెందిన శ్రీను ఎద్దులకు ప్రథమ బహుమతి రూ.10 వేలు, ట్రోఫీ, మురముండకు చెందిన సురేష్ గౌడ ఎద్దులకు రూ.8 వేలు, తోకలంక ఎద్దులకు రూ.7 వేలు, సీతానగరానికి చెందిన ఎద్దులకు రూ.6 వేలు, గాడాలకు చెందిన శ్రీను ఎద్దులకు రూ.5 వేలు చొప్పున నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను అందజేశారు. పాల్గొన్న ఎద్దుల యజమానులందరికీ రూ.వెయ్యి చొప్పున అందజేశారు. స్థానికనాయకులు, రైతులు పాల్గొన్నారు.

గెయిల్ పైప్‌లైన్లపై నిరంతర పర్యవేక్షణ



నగరంలోని గెయిల్ టెర్మినల్‌ను సందర్శిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు

జీఎం ముఖర్జీ

మామిడికుదురు: గెయిల్ పైప్‌లైన్లపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని ఆ సంస్థ జనరల్ మేనేజర్ ఎస్.ముఖర్జీ తెలిపారు. ఎన్‌డీఆర్ఎఫ్ పదో బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ భూపేంద్రకుమార్ నేతృత్వంలో బృందం మంగళవారం నగరం గ్రామంలోని గెయిల్ టెర్మినల్‌ను సందర్శించింది. భద్రతా పరమైన చర్యలను టెర్మినల్ అధికారులు బృందానికి వివరించారు. ఏదైనా ప్రమాదాలు జరిగే సందర్భాల్లో వాటిని ఎదుర్కొనేందుకు తాము సర్వసన్నద్ధంగా ఉన్నామన్నారు. పైప్‌లైన్లను నిత్యం తనిఖీ చేసే వ్యవస్థ తమకు అందుబాటులో ఉందన్నారు. పైప్‌లైన్ల నాణ్యతను బట్టి ప్రతి 20 నుంచి 25 ఏళ్లకు ఒకసారి కొత్త పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎక్కడైనా లీకేజీలు, ప్రమాదాలు జరిగిన వెంటనే అది ఎక్కడ జరిగిందో క్షణాల్లో తమకు తెలిసేలా నగరం టెర్మినల్‌లోని అధునాతన వ్యవస్థ ద్వారా తమకు సమాచారం అందుతుందన్నారు. ఏదైనా ఘటనలు జరిగిన సందర్భంలో ప్రజలు తమకు సమాచారం అందించేలా ఎక్కడికక్కడ 15101 టోల్ ఫ్రీ నంబర్లను ప్రదర్శించినట్లు తెలిపారు. ఏదైనా సంఘటనలు జరిగిన సందర్భంలో తమ నుంచి ఏవిధమైన సహకారం కావాలో చెప్పాలని ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ భూపేంద్రసింగ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో పి.సునీల్‌కుమార్, గెయిల్ జీఎం పి.పోతయ్య, డీజీఎం బి.మహంతి, సీనియర్ మేనేజర్లు ఎస్.సుధీర్‌కుమార్, ఎస్.రామకృష్ణ, ఆర్ఐ ఇబ్రహీం, వీఆర్వోలు ఉన్నారు.

డ్రైన్‌లో ఆవు మూగ వేదన

అతి కష్టంపై తీసిన అగ్నిమాపక సిబ్బంది



ఆవును బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు

అమలాపురం టౌన్: స్థానిక విత్తనాల వారి కాల్వ ప్రాంతంలో ఓ ఆవు రోడ్డు పక్క డ్రైన్‌లో ప్రమాదవశాత్తు పడిపోయి బయటకు వచ్చేందుకు నరకయాతన పడింది. డ్రైన్‌లో పడి ఇరుక్కుపోయిన ఆవు అవస్థ చూసిన స్థానికులు, విశ్వహిందూ పరిషత్, భజరంగ దళ్ కార్యకర్తలు స్పందించి అగ్నిమాపక దళానికి సమాచారం అందించారు. ఆ సిబ్బంది తాళ్లు, చెక్క బల్లలతో ఆవును తీసేందుకు విశ్వ ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. మరో ప్రయత్నంగా డ్రైన్‌ను కొంచెం పగలగొట్టి ఆవును బయటకు తీశారు. పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయరెడ్డి కూడా అక్కడకు చేరుకుని ఆవును ఆరోగ్య పరిస్థితిని పరీక్షించారు. ఆవు సురక్షితంగా బయటకు రావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

యోగాంధ్ర పేరిట అధికారుల కాలక్షేపం

- నెల రోజుల పాటు పనులకు దూరం
- ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ధ్వజం



అమలాపురంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్య నారాయణరావు ←

అమలాపురం టౌన్: యోగాంధ్ర పేరిట అధికారులు నెల రోజుల పాటు పనులు చేయకుండా కాలక్షేపం చేశారని, ఆహార భద్రతను గాలికి వదిలేశారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. పట్టణంలోని హైస్కూల్ సెంటరులోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నేడు లక్షలాది మంది గుండె జబ్బులు, లివర్, కిడ్నీ వంటి వ్యాధులకు గురవుతున్నారని ఆయన గుర్తు చేశారు. నేటి యువతలో అనేక మంది పాన్ పరాగ్ వంటి మాదక ద్రవ్యాలను ఎక్కువగా తీసుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. కల్తీ ఆహార పదార్థాల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయని పేర్కొన్నారు. పంట కాల్వల్లోకి సెప్టిక్‌ట్యాంక్ వ్యర్థాలను గొట్టాల ద్వారా తరలిసూ కలుషితం చేస్తున్నారని వివరించారు. ఇలాంటి ఎన్నో సమస్యలు పట్టి పీడిస్తున్నా యోగాంధ్ర పేరుతో అధికారుల హడావుడి తప్ప వీటిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని ఆరోపించారు. ప్రజారోగ్యానికి సంబంధించి ఎక్కడా తనిఖీలు లేవని ధ్వజమెత్తారు. యోగాంధ్ర పేరుతో ప్రచారం తప్ప ఎక్కడా కార్యాచరణ లేదని ఆరోపించారు. పాఠశాలల్లో పిల్లలకు వ్యాయామం తప్పనిసరి చేసి రోజూ ఓ గంట సేపు చేయించాలని. ఒక్క రోజు, లేదా కొన్ని రోజుల యోగా శిక్షణలతో ఆరోగ్య సమాజం సిద్ధించదని, అది నిరంతర ప్రక్రియ అని, శిక్షణ అయినప్పుడే దాని వల్ల ప్రయోజనాలు సార్థకం అవుతాయని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు అభిప్రాయపడ్డారు.

కలెక్టర్, ఎస్పీలకు ప్రపంచ బుక్ రికార్డు



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నుంచి రికార్డు అందుకుంటున్న కలెక్టర్ మహేష్ కుమార్, ఎస్పీ కృష్ణారావు

అమలాపురం రూరల్: అంతర్వేది బీచ్‌లో నిర్వహించిన వృక్షాసనం, భారీ మానవహారం, యోగాంధ్ర నిర్వహణలకు జిల్లా అధికారులు పురస్కారాలు అందుకున్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా కలెక్టర్ మహేష్ కుమార్, ఎస్పీ బి.కృష్ణారావు మంగళవారం వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను అందుకున్నారు. అంతర్వేది బీచ్‌లో నిర్వహించిన యోగాంధ్రలో భాగంగా వృక్షాసనం, భారీ మానవహారాలకు వారు ముఖ్యమంత్రి నుంచి ప్రశంసలు అందుకున్నారు.

ఏసీ బ్లాక్ నకిలీ మద్యం గుట్టు రట్టు

- కొమరిగిరిపట్నం అడ్డాగా దందా
- ఎనిమిది మందిని అరెస్టు చేసిన ఎక్సైజ్ ఏసీ రేణుక బృందం
- హైదరాబాద్, పాలకొల్లుకు చెందిన మరో ఇద్దరి కోసం గాలింపు
- 1065 నకిలీ మద్యం సీసాలు, ఇతర సామగ్రి స్వాధీనం



నకిలీ మద్యం రాకెట్ వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రేణుక, సూపరింటెండెంట్ ప్రసాద్ తదితరులు

అమలాపురం టౌన్: అల్లవరం మండలం కొమరిగిరిపట్నంలోని ఓ ఇంటిలో కొన్ని రోజులుగా గుట్టుగా సాగుతున్న నకిలీ మద్యం తయారీ యూనిట్ గుట్టును ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుక బృందం బహిర్గతం చేసింది. కొమరిగిరిపట్నం గ్రామ శివారు ఆకుల వారి వీధిలోని ఓ ఇంటిపై ఎక్సైజ్ అధికారులు సోమవారం మెరుపుదాడి చేసి నకిలీ మద్యం బాటిలింగ్ మినీ యూనిట్‌ను, నిర్వాహకులను పట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ దాడిలో పట్టుబడ్డ నకిలీ మద్యం సీసాలు, ఇతర సామగ్రిని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రేణుక, సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్, సీఐలు, ఎస్సైలు అమలాపురంలోని ఎక్సైజ్ స్టేషన్ ప్రాంగణంలో మంగళవారం ప్రదర్శించి వివరాలను విలేకరులకు వెల్లడించారు.

తయారీ ఇలా

ఈ నకిలీ మద్యం ముఠా హైదరాబాద్, పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు ప్రాంతాల నుంచి కేరామిల్ లిక్విడ్, స్పిరిట్‌ను ముడి సరకుగా దిగుమతి చేసుకుంటోంది. మద్యం రంగు కోసం స్పిరిట్‌లో కేరామిల్ లిక్విడ్ కలుపుతారు. ఏపీ బేవరీస్ లిమిటెడ్ తయారీ చేసి సరఫరా చేసే డ్యూటీ పెయిడ్ మద్యంలానే నకిలీ మద్యం సీసా తయారు చేసి ఆకర్షణీయమైన లేబుల్‌తో రూపొందిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఏసీ బ్లాక్ పేరుతో ఉన్న లేబుల్ బాటిల్‌పై అంటించి దానిలో వారు తయారు చేసిన మద్యాన్ని నింపుతున్నట్టు అధికారుల బృందం ప్రత్యక్షంగా గమనించింది. దాడి సమయంలో అక్కడి నుంచి మద్యం తయారీ మెషీన్, అప్పటికే తయారు చేసిన 1065 మద్యం సీసాలు, ఆరు వేల ఖాళీ సీసాలు, కేరామిల్ లిక్విడ్ డబ్బాలు, ఏసీ బ్లాక్ పేరుతో ఉన్న లేబుల్ బండిల్ తదితర సామగ్రిని వారు స్వాధీనం చేసుకున్నారు. అలాగే మద్యం నిల్వ చేసిన గొడౌన్‌ను, మద్యం సరఫరాకు వినియోగించే ఆటోను వారు సీజ్ చేశారు.

8 మంది అరెస్టు

ఈ ఘటనకు సంబంధించి ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్టు అధికారులు వివరించారు. అమలాపురం మండలం పేరూరుకు చెందిన చింతపల్లి సోమశేఖర, చవ్వాకుల ప్రేమ్ కుమార్, ఇదే మండలం చిందాడగరువు గ్రామానికి చెందిన నేరేడుమిల్లి సుబ్రహ్మణ్యం, పిల్లా శ్రీనివాస్, కాజులూరు మండలం దిద్దుకూరుకు చెందిన నురుకుర్తి శ్రీనివాసరావు, అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన బొర్రా సత్య అప్పారావు, అల్లవరం మండలం కొమరిగిరిపట్నానికి చెందిన పితాని వెంకట దుర్గ సింహాద్రి, తిరుమనాధం దుర్గారావులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రేణుక తెలిపారు. వీరికి హైదరాబాద్, పాలకొల్లు నుంచి స్పిరిట్, కేరామిల్ లిక్విడ్ సరఫరా చేస్తున్న ఇద్దరు కీలక నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టమన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే ఒరిజినల్ మద్యం బాటిల్ రూ.160 ఉంటే వీరు తయారు చేసే నకిలీ మద్యం బాటిల్‌ను రూ.80 నుంచి రూ.120 వరకూ విక్రయిస్తున్నట్టు తెలిపారు.

పక్కా సమాచారంతో..

రామానుజ తేజ అనే ఓ ఎక్సైజ్ అధికారి సేకరించిన సమాచారంతో ఈ దాడి చేశామన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్, సీఐ వీరాబాబు తదితరులు కూడా ఈ ఆకస్మిక దాడిలో పాల్గొన్నారని తెలిపారు. పాలకొల్లులో కూడా అక్కడి ఎక్సైజ్ అధికారుల బృందం దాడి చేసి 130 లీటర్ల స్పిరిట్‌ను పట్టుకున్నట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యాన్ని ప్రభుత్వ ఎనాలిసిస్ ల్యాబ్‌కు పంపి పరీక్షలు చేయిస్తామన్నారు. ఈ నకిలీ మద్యం రాకెట్‌లో మరికొందరు నిందితులు ఉన్నారని, వారిని త్వరలో అరెస్టు చేస్తామని రేణుక తెలిపారు.

పాము కాటుతో యువతి మృతి



రవీనా మాధురి (ఫైల్)

గోకవరం: మండలంలోని కొత్తపల్లికి చెందిన తెంటి రవీనామాధురి (22) పాముకాటు కు గురై మృతి చెందింది. వివరాల ప్రకారం మాధురి సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటి వద్ద బట్టలు ఉతుకుతుండగా నల్లతాచు కుడికాలిపై కాటు వేసింది. తండ్రి శ్రీనివాస్‌రావు వెంటనే ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందింది. ఆమె ఇటీవలే తన గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేసుకుంది. ఆమెకు తల్లి, తండ్రి, సోదరి ఉన్నారు. ఎస్సై పవన్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


డ్రైన్‌లో పడి యువకుడి మృతి



సీసీడ్రైయిన్‌లో పడి మృతిచెందిన బాబులు

కరప: అసంపూర్తిగా వదిలేసిన డ్రెయిన్‌లో పడిన ఓ యువకుడు అందులోని ఇనుప రాడ్ గుచ్చుకుని మృతి చెందిన ఘటన స్థానికంగా కలవరపరచింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు కొరిపల్లి గ్రామానికి చెందిన పరిసిపోగులు బాబులు (35) కూలి పని చేస్తుంటాడు. అతనికి ఇద్దరు భార్యలు, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మంగళవారం కరపకు వచ్చిన బాబులు మద్యం తాగి ఆ మత్తులో తిరిగి కొరిపల్లి వెళ్తూ రోడ్డుపక్కన అసంపూర్తిగా వదిలేసిన సీసీ డ్రైన్‌లో అదుపు తప్పి పడిపోయాడు. దీంతో డ్రైన్‌లోని ఇనుప రాడ్ ఒకటి అతని చెవిలోంచి తలలోకి దిగిపోయింది. అక్కడే తాపీ పనిచేస్తున్న వారు మిషన్‌తో ఆ రాడ్‌ను కట్ చేసి చికిత్స కోసం 108లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడి వైద్యులు బాబులును పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. కరప ఎస్ఐ టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వచ్చే నెల 9న దేశవ్యాప్త సమ్మె



ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో మాట్లాడుతున్న కోదండరామ్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు వచ్చేనెల 9న నిర్వహించనున్న ఒకరోజు సమ్మెను విజయవంతం చేయాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ రాజమండ్రి డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ ఎల్ఐసీ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. మోరంపూడిలోని ఎల్ఐసీ డివిజన్ కార్యాలయంలో మంగళవారం భోజన విరామ సమయంలో ఎల్ఐసీ క్లాస్–3, క్లాస్–4 ఉద్యోగుల నిరసన ప్రదర్శన చేశారు. కోదండరామ్ మాట్లాడుతూ బీమా భారంగా మారిన తరుణంలో జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ బీమా, బ్యాంకులను కాపాడాలని కోరారు. కార్మికుల హక్కులను హరించే కొత్త లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్‌లను రద్దు చేసి, ఎల్ఐసీలో ఖాళీగా ఉన్న క్లాస్–3, 4 ఉద్యోగుల నియామకాలు వెంటనే చేపట్టాలన్నారు. బీమా రంగంలో విదేశీ పెట్టుబడులను అనుమతించవద్దని కోదండరామ్ డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షుడు మాథ్యూస్ అధ్యక్షతన జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో యూనియన్ నాయకులు, సత్యదేవ, పిఎస్ఎన్ రాజు, ఈశ్వరరావు, పట్నాయక్, ఇమ్రాన్, శిరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కాకినాడ రూరల్: కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, మండలంలోని పెనుమర్తి గ్రామానికి చెందిన గణపతిరాజు రామభద్రరాజు(49) కొంతకాలంగా అనారోగ్యంతో ఖాళీగా ఉంటూ, మద్యానికి బానిసయ్యాడు. మద్యం కోసం డబ్బులివ్వమని ఇంట్లోవారిని వేధించేవాడు. మంగళవారం తన కుమారుడిని మద్యానికి డబ్బులు అడగ్గా, ఇవ్వలేదన్న కోపంతో బయటకు వెళ్లిపోయాడు. ఊరి చివర మామిడితోటలో కేబుల్ వైర్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకుని అతని భార్య మామిడితోటలోకి వెళ్లిచూడగా అతడు మరణించి ఉన్నాడు. మృతుని భార్య సుబ్బలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిమ్మాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.